క్లుప్తంగా

వివాద స్థలంలోకి వెళ్లొద్దు

● చేవెళ్ల ఆర్డీఓ సాయిరామ్



అధికారులు ఏర్పాటు చేసిన నోటీసు బోర్డు

మొయినాబాద్‌రూరల్: ఇరు వర్గాలకు సంబంధించిన స్థలంలోకి ఎవరూ వెళ్లకూడదని పోలీసుల ద్వారా నోటీసు బోర్డును చేవెళ్ల ఆర్డీఓ సాయిరామ్ వేయించారు. ఈ నెల 3న హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధిలోని 145 సర్వే నంబర్‌లో పంచాయతీ అధికారులు అక్రమ వెంచర్ కూల్చివేతతో ప్రీకాస్ట్ గోడలు, రూమ్‌లను తొలగించారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాలు శనివారం ఆ స్థలానికి చేరుకొని ఆక్రమణ పర్వానికి తెర లేపడంతో స్థానికులు ఆర్డీఓ సాయిరామ్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన స్పందించి వివాదాస్పదంగా ఉన్న 145 సర్వే నంబర్‌లో 9.27 ఎకరాల స్థలంలో నోటీసు బోర్డును పాతించారు. స్థల వివాదం పరిష్కారం అయ్యేంత వరకు ఎవరూ వెళ్లకూడదని ఆర్డీఓ ఆదేశాలు జారీ చేశారు. పోలీసుల చొరవతో ఇరు వర్గాలను శాంతింపజేశారు.

‘ప్రజాపాలన’ చూసి ఓర్వలేక విమర్శలు

● పీసీసీ నేత గౌరీ సతీశ్



మొయినాబాద్‌రూరల్: రెండు పర్యాయాలు తెలంగాణ ప్రజలను మోసం చేసింది చాలక.. ప్రజాపాలనను చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని టీపీసీసీ నేత గౌరీ సతీశ్ ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి ఆశీర్వదించారన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పినా దోచుకునే అహంకారం తగ్గలేదన్నారు. రైతులకు రుణమాఫీ, ఉద్యోగాల నియామకాలు, దళితులకు మూడు ఎకరాల భూమి, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ముస్లిం, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్‌లు, అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్‌లు కట్టించడంలో విఫలమై లక్షల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసింది బీఆర్ఎస్ పార్టీ అని మండిపడ్డారు. ప్రజాపాలన చూసి ఓర్వలేక నెల రోజులు గడిచిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



మహాపడిపూజలో భక్తులు

షాబాద్: అయ్యప్ప నామస్మరణతో బొబ్బిలి గామ మార్మోగింది. శనివారం అయ్యప్పస్వాముల మహా పడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉమాశంకర్‌రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో పూజ కొనసాగింది. అనంతరం అయ్యప్ప స్వాములు ఇరుముడులు కట్టుకుని శబరిమలకు వెళ్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ అర్చన సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు. స్వామివారి పూజ కోసం మండపాన్ని 18మెట్లతో పూలు, దీపాలతో అందంగా అలంకరించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు తదితరులున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● షాబాద్‌లో 15,991 ‘ప్రజాపాలన’ దరఖాస్తులు



ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు నమోదు చేస్తున్న అధికారులు

షాబాద్: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని షాబాద్ ఎంపీడీఓ అనురాధ తెలిపారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలో ‘ప్రజాపాలన’కు సంబంధించి 15,991 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు కృషి చేస్తామన్నారు. చివరి రోజున కావడంతో ఆన్‌లైన్ కొంత ఇబ్బంది పెట్టిందన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు దరఖాస్తుల జోరు

షాద్‌నగర్‌లో 90,254 అభ్యర్థనలు ● ప్రత్యేక వెబ్‌సైట్‌లో వివరాల నమోదు

షాద్‌నగర్: ప్రజాపాలన అభయహస్తం ఐదు పథకాల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ముగిసింది. ప్రజల నుంచి వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేసే కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. ఇందుకుగాను కంప్యూటర్ ఆపరేటర్ల సేవలను వినియోగిస్తూ నమోదు చేస్తున్నారు. ప్రజలకు పాలనను చేరువ చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం గత నెల 28న ప్రారంభమై జనవరి 6తో ముగిసింది. ఇందులో భాగంగా మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పేరిట ఐదు గ్యారంటీ పథకాలకు ప్రజల నుంచి ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పథకాల కోసం భారీ ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో 90,254 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం

ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేస్తున్నారు. ప్రజలు చేసుకున్న దరఖాస్తులన్నింటినీ పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమం ప్రారంభం అయ్యింది. అయితే ఆన్‌లైన్ నమోదుకు సంబంధించి ఇప్పటికే ఉన్నతాధికారులు మున్సిపల్, ఎంపీడీఓ, తహసీల్దార్లు, ఐకేపీ, మెప్మా, కంప్యూటర్ ఆపరేటర్లతో పాటుగా పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు దరఖాస్తుల నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. వారి పేరుతో ప్రత్యేక లాగిన్ కేటాయించి సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ సహాయంతో డాటా ఎంట్రీ చేసేలా పక్కాగా చర్యలు చేపట్టారు. దరఖాస్తులన్నింటినీ ప్రత్యేక లాకర్‌తో కూడిన బీరువాల్లో భద్రపరుస్తున్నారు. నమోదు ప్రక్రియ పూర్తి అయ్యాక దరఖాస్తుదారుడి సెల్‌ఫోన్‌కు రిజిస్ట్రేషన్ నంబర్ సందేశం వస్తుందని అధికారులు తెలిపారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ (ఫైల్)

తప్పులకు తావు లేకుండా చర్యలు

దరఖాస్తులో ఉన్నది ఉన్నట్లుగా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధంగా చర్యలు చేపట్టారు. సిబ్బంది నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. నమోదు చేసిన డాటా ఆధారంగానే లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందనున్నాయి. ఈ నేపథ్యంలో ఆధార్, రేషన్‌కార్డు, సెల్‌ఫోన్ నెంబర్లు జాగ్రత్తగా ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని సిబ్బందికి అధికారులు సూచించారు. ఈ నెల 17వ తేదీ నాటికి నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు రావడంతో అందుకు తగిన విధంగా అధికారులు చర్యలు చేపట్టారు.

పక్కాగా నమోదు



ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాం.

– వెంకన్న, మున్సిపల్ కమిషనర్, షాద్‌నగర్

షాద్‌నగర్ నియోజకవర్గంలో దరఖాస్తుల వివరాలు

మండలం	వచ్చిన దరఖాస్తులు
కొత్తూరు	5,847
కొందుర్గు	9,345
జిల్లేడు చౌదరిగూడ	9,912
కేశంపేట	13,801
ఫరూఖ్‌నగర్	19,859
నందిగామ	9,124
కొత్తూరు మున్సిపాలిటీ	4,011
షాద్‌నగర్ మున్సిపాలిటీ	18,355
మొత్తం	90,254

దరఖాస్తుల వెల్లువ

● ముగిసిన ప్రజాపాలన
● చేవెళ్ల మండలంలో 18,752 అభ్యర్థనలు

చేవెళ్ల: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే ఆరు గ్యారంటీ పథకాలను అదించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల స్వీకరణకు భారీగా ప్రజల నుంచి స్పందన వచ్చిందని చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ అన్నారు. శనివారం చేవెళ్ల పంచాయతీ వద్ద ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ఆమె పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ.. చేవెళ్ల మండల కేంద్రంలో మొత్తం 2,192 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. అధికారులు అర్హులైన ప్రజలను గుర్తించి వారికి ప్రభుత్వం అందించే ఆరు గ్యారంటీలను పక్కగా అమలు చేసి తీరుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజల ప్రభుత్వమని ఇచ్చిన హామీలను అమలు చేసి తీరుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదయ్య, వార్డు సభ్యులు శ్రీనివాస్, మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కౌంటర్లు

మండలంలోని 37 పంచాయతీలకు సంబంధించి ఎనిమిది రోజుల పాటు నిర్వహించిన ప్రజాపాలనలో మొత్తం 18,752 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. అన్ని పంచాయతీలలో చేపట్టిన గ్రామ సభల ద్వారా, ప్రతి రోజు కేటాయించి ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. దాదాపు అన్ని గ్రామాల్లో మెజార్టీ ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారని ఇంకా ఎవరైన మిగిలిపోయిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తామని చెప్పిందన్నారు. మండలంలో మొత్తం 14,743 కుటుంబాలు ఉండగా దరఖాస్తులు 18,752 వచ్చినట్లు చెప్పారు.



గ్రామ పంచాయతీ వద్ద దరఖాస్తుల స్వీకరణలో సర్పంచ్ శైలజ, పాలకవర్గం

హనుమాన్ ఆలయంలో పల్లకీ సేవ



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ఘనంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆటపాటలు, భజనలతో స్వామి వారిని ఊరేగించారు. ఆలయ అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రచారి, కృష్ణ, ప్రమోద్, సునీల్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి జై కిషన్ జవార్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లతా శ్రీశైలంగౌడ్, రమేశ్, రఘునందన్‌రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్, కిషన్ నాయక్, రాఘవేందర్, నారాయణ, కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణాచారి, శంకర్‌గౌడ్, నర్సింలు, పద్మా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

● రజక సంఘం భవన నిర్మాణానికి పూజలు



స్లాబ్ పనులు ప్రారంభించిన సర్పంచ్ శైలజ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులు

చేవెళ్ల: గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డిలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రజకనగర్‌కాలనీలో రజక సంఘానికి స్థలం కేటాయించి భవన నిర్మాణం పనులు చేపట్టారు. శనివారం భవనం స్లాబ్ పనులకు పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శైలజ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డిలు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో తమ వంతు కృషిని అందించేందుకు ఎప్పుడు తోడుంటామన్నారు. రజక సంఘం సభ్యులకు ఇచ్చిన హామీ ప్రకారం సంఘం భవనం కోసం తమ సొంత స్థలంలో 166 గజాలు కేటాయించామని, అందులోనే భవన నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదయ్య, వార్డు సభ్యులు శ్రీనివాస్, హరికృష్ణ, మల్లారెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, వినోద్‌కుమార్, కుమార్, రాములు, పెంటయ్య, మల్లేశ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంపై అవగాహన



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు శైలజ

షాద్‌నగర్‌రూరల్: ప్రతినిత్యం ధ్యానం చేయడంతో ఏకాగ్రత సాధ్యమని ప్రధానోపాధ్యాయురాలు శైలజ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఆధ్వర్యంలో కన్హా శాంతివనం సహకారంతో విద్యార్థులకు ధ్యానంపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతివిద్యార్థి నిత్యం ధ్యాన సాధన చేయాలని అన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని అన్నారు. ప్రతివిద్యార్థి లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని అన్నారు. కృషి, పట్టుదలతో సాధన చేస్తే విజయతీరాలకు చేరుకుంటారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, ప్రసన్న, రంగనాథ్, రాజు, బాల్‌రాజు, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రదర్శనలతో సృజనాత్మకత

● వెల్‌స్పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ఎంఈఓ శంకర్‌రాథోడ్



సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

షాబాద్: విజ్ఞాన ప్రదర్శనలతోనే విద్యార్థుల సృజనాత్మకత పెంపొందుతుందని వెల్‌స్పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, షాబాద్ ఎంఈఓ శంకర్‌రాథోడ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో బాలికల, బాలుర, కేజీబీవీ, ఉన్నత పాఠశాల విద్యార్థులతో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారుమూల గ్రామల్లోని విద్యార్థులు సైతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ఆసక్తి ఉన్న రంగంలో రాణించేలా ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణలు ఇస్తున్నామన్నారు. పోటీ ప్రపంచానికి అనుగుణంగా మానవాళికి అవసరమయ్యే ప్రయోగాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. భౌతిక శాస్త్రవేత్త సీవీ రమన్ సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు విజ్ఞానంలో ముందుండాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సైన్స్ ప్రయోగాలను పరిశీలించి, వాటి ఉపయోగాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, సర్పంచ్ సుబ్రమణ్యేశ్వరి, ఎంపీడీఓ అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో సెమిస్టర్ పరీక్షలు

ఇబ్రహీంపట్నం: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థులకు మూడో సెమిస్టర్, మూడో సంవత్సరం విద్యార్థులకు ఐదవ సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి మాసంలో నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ప్రభు, కో ఆర్డినేటర్ డాక్టర్ నాగోజి తెలిపారు. ఈ నెల 17వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువుందన్నారు. అయితే రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 23 వరకు ఫీజు చెల్లించవచ్చునని తెలిపారు. క్రెడిట్, డెబిట్ కార్డులతోనే ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 73829 29772 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించవచ్చునని తెలిపారు.

సేంద్రియ ఎరువులతో భూసారం పెంపు

● సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్
● రైతులకు అవగాహన కార్యక్రమం



రైతులకు అవగాహన కల్పిస్తున్న రత్నాకర్

షాబాద్: రైతులు సేంద్రియ ఎరువుల వాడకం తప్పనిసరిగా పాటించాలని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ గొల్లపెల్లి రత్నాకర్ పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో రైతులకు ఎరువుల వాడకం, నేల ఆరోగ్యంపై సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొంత కాలంగా భూసారం కాల క్రమేణా తగ్గిందన్నారు. ప్రస్తుతం భూమి పంటలు పండించే శక్తి కోల్పోయే స్థితికి చేరిందన్నారు. పశువుల ఎరువులు, ఇతర సేంద్రియ ఎరువులు వాడకపోవడంతో భూసారం దెబ్బతింటుదన్నారు. సేంద్రియ కర్బనం 1 శాతం కంటే తక్కువ ఉంటే పంటల ఎదుగుదల, దిగుబడులు ఆశించినంతగా ఉండవన్నారు. అలాంటి నేలల్లో పంట దిగుబడులు పెంచాలంటే రైతులు సేంద్రియ ఎరువుల వాడకం తప్పనిసరిగా చేయాలన్నారు. వాతావరణ వ్యత్యాసాల వల్ల పంట దిగుబడులు ఆశించినంతగా ఉండటం లేదన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా కర్బనాన్ని పెంచవచ్చన్నారు. ముఖ్యంగా బాయోచర్, పచ్చిరొట్ట, పశువుల ఎరువు, పంట వ్యర్థాలు నేలలో కలియదున్నడంతో సారం పెరుగుతుందన్నారు. సుగుణమాల రైతు ఉత్పత్తి దారుల సంఘం చైర్మన్ లింగం మాట్లాడుతూ.. రైతులు భూసార పరీక్షించి ఏయే పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకొని తక్కువ ఉన్న పోషకాలు నేలకు అందిస్తే మంచి దిగుబడి పొందవచ్చొన్నారు. అడ్వాన్స్ పెస్టిసైడ్స్ కంపెనీ రీజినల్ సేల్స్ మేనేజర్ కృష్ణారావు మాట్లాడుతూ.. పైర్లకు పోషకాలు అందించడంలో సమతుల్యత పాటించకపోవడం వల్ల నేల ఆరోగ్యం, ఉత్పాదకత తగ్గిపోవడం జరుగుతుందన్నారు. అంతే కాక రైతులు పురుగులను, తెగుళ్లను, పోషక మూలకాల లోప లక్షణాలను గుర్తించడంలో సరైన అవగాహన లేక కృత్రిమ మందులను విచక్షణరహితంగా వాడటంతో పంటల్లో రసాయన అవశేషాలు ఉంటున్నాయన్నారు. మిత్ర జీవులు నశించి పోవడం, పర్యావరణ కాలుష్యం వంటివి వాటిల్లడం జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు యాదవరెడ్డి, అంజయ్య, గోపాల్‌రెడ్డి, శేఖరయ్య, కంపెనీ ప్రతినిధి సురేష్, గ్రామ రైతులు తదితరులున్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య శిబిరంలో సర్పంచ్ దర్శన్, డాక్టర్లు

షాబాద్: పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సంకెపల్లిగూడ సర్పంచ్ కుమ్మరి దర్శన్ పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని సంకెపల్లిగూడ, శేరిగూడ గ్రామాలల్లో చేవెళ్లకు చెందిన పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల వైద్యులు శిబిరాన్ని నిర్వహించారు. అందులో 215 మంది రోగులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులున్నారు.

ఊరూరా రామయ్య అక్షితలు



మొయినాబాద్: అప్పోజీగూడలో అక్షితలకు పూజ చేస్తున్న గ్రామస్తులు



షాబాద్: పోతుగల్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు



మొయినాబాద్‌రూరల్: కాశీంబౌలిలో మహిళలకు అయోధ్య అక్షితలు పంపిణీ చేస్తున్న భక్తులు

● భక్తిశ్రద్ధలతో పూజలు

మొయినాబాద్: అయోధ్యలో రామమందిరం ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని గ్రామాల్లో ఇంటింటికీ అయోధ్య అక్షితలు అందజేస్తున్నారు. శనివారం మండల పరిధిలోని అప్పోజీగూడలో అయోధ్య నుంచి వచ్చిన అక్షితలను వితరణ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గౌర్కంటి రాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భక్తిభావాన్ని పెంచుకోవాలన్నారు. భక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుంద న్నారు. ఈ నెల 22న అయోధ్యలో రామమందిరం ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అక్కడి నుంచి వచ్చిన అక్షింతలను ప్రతి ఇంట్లో ఉండాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీరాముడి స్ఫూర్తితో..

షాబాద్: శ్రీరాముడిని స్ఫూర్తిగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ్ రామ్ పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో అక్షితలు పంపిణీ చేశారు. అనంతరం హనుమాన్ దేవాలయం నుంచి భక్తజనులు ఊరేగింపుగా అక్షితలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాడు శ్రీరాముడు ధర్మపోరాటం చేసి విజయం సాధించారని, ఈనాటి ధర్మపోరాట ఫలితమే శ్రీరామ మందిరమని అన్నారు. శక్తివంతుడైన శ్రీరాముడిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు గోపాల్‌రెడ్డి, దయానంద్‌గౌడ్, కిషన్‌నాయక్, భుజంగారెడ్డి, రాజు తదితరులున్నారు.

జై శ్రీరామ్ అంటూ..

మొయినాబాద్‌రూరల్: అయోధ్య రాముడి అక్షితలు కాశీంబౌలి గ్రామంలో భక్తులు, నాయకులు పెద్ద ఎత్తున పంపిణీ చేశారు. శనివారం గ్రామ ఉపసర్పంచ్ నల్లా జయరామ్‌రెడ్డి గ్రామస్తులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ జై శ్రీరామ్ అంటూ రాముడి అక్షితలు ఇళ్లల్లోని మహిళలకు వితరణ చేశారు. కార్యక్రమంలో జయరామ్‌రెడ్డి, వార్డు సభ్యులు సుధాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శరత్‌రెడ్డి గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.